# "మా శ్రీవారు"

రచన: "సరోజ"




అన్నయ్య అప్పుడే బండిదిగి వచ్చాడు.

ఎక్కడకు వెళ్లేడో నా కప్పటికి తెలియదు. నవ్వుమొఖంతో కడపలో కాలుబెట్టాడు. మా వదిన ఎదురుగా వచ్చి కాయా-పండా అంటూ కాళ్లు కడుగుకోవటానికి నీళ్లిచ్చింది. 'మనం వెళ్లితె పండుగాక - కాయ అవడం ఎప్పుడన్న చూసావా? అంటున్నాడు. వాళ్ల సంభాషణ నా కప్పటి కవగతం కాలేదు. తర్వాత వదినే చెప్పతుందిలే అనుకొని నా రూమ్‌లోకి వెళ్లిపోయాను. కాని నా ఆలోచన పరిపరివిధాల పోతోంది. ఇంతలో మా అన్న స్నానం చేసి భోజనానికి వచ్చాడు. మా వదిన ఏదో అడుగుతుంది. అన్నయ్య చెప్పతున్నాడు. '

"రేపే పెండ్లి చూపులకు వస్తానన్నారు. పెండ్లికొడుకు పరవాలేదు అందచందాలకు లోటులేదు. నవ నాగరికత లక్షణాలు అన్ని వున్నాయి - అతన్ని చూడటంతోటే మన సరోజకు తగిన వరుణ్ణిగా నిశ్చయించుకొన్నాను - కాని వాళ్ళు యిష పడాలిగా! అని అంటున్నాడు. అన్నయ్యమాటలకు అడ్డువస్తు పెండ్లికొడుకు పుట్టు పూర్వోత్తరాలు చెప్పరేమండీ, అంటూ వదిన ఒక దీర్ఘంతీసింది. "ఆఁ......ఏమున్నయి అతనిది మన గుడివాడే అంటూ గుంటూరులో ఏదో హైస్కూల్లో సైన్సు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడట. తల్లీ దండ్రీ వున్నారు. ఇద్దరు అన్నదమ్ములట; యిద్దరు తోబుట్టువులనుకొంటాను. నాల్గెకరాలమాగాణి కూడా వుందట, కుటుంబం కూడా మంచిదేనని ఆ వూరి వాళ్లను అడగ్గా చెప్పారు. అయినా రేపువస్తారుగా...యిప్పుడే కంగారు పడట మెందుకు అని అన్నయ్య అన్నం ముగించారనుకొంటా, బయట మాటలు వినిపిస్తున్నాయి

మా కాలేజీ శెలవువిచ్చి యింకా వారమన్నా సరిగ్గా తిరగలేదు. మా స్నేహితుల్తో స్టడి పూర్తికాందే కనీసం యీ సంవత్సరానికి పెండ్లి చేసుకోనని గట్టిగా చెప్పివచ్చాను. ఇంతలోనే యీబడిమేళం వచ్చి పడుతుందని ఎవరనుకొన్నారు? అందులో కన్నతండ్రిలా చూసే అన్నమాటకు ఎదురు చెప్పడం ఎలా? యీ ఆలోచనలతో తికమక పడ్తున్నాను, నామనస్సంతా భావనా ప్రపంచంలోకి మెల్ల మెల్లగా సాగిపోతోంది.

రేపునన్ను చూస్తానికి వస్తారట- ఇంతకూ ఆవచ్చే ఆయన ఎలా వుంటారో? వారి తత్వ మెలాంటిదో? కోపిష్టి మనుష్యులేమో-అసలీ సంబంధం ఖాయమవుతుందో? లేదో? అయితే రేపే చీరమీద ఏ జాకెట్టు వేయాలి? ఎలా టాయలెట్ అవ్వాలి? ఆ వచ్చిన వారు నన్నే మడుగుతారు? వారికి సమాధానం నేనేలా చెప్పాలి? అనే ప్రశ్నపరంపరలు నాలో ఒక దానివెంట ఒకటి తరుముకొచ్చి నన్ను తికమకలు పరుస్తున్నాయి

ఇలా ఎంత టైమ్ గడిచిందో కాని మా వదినవచ్చి "అమ్మాయి! కాఫీ తీసుకొందువుగాని లేచిరా! అనే వరకు నా భావనా ప్రపంచంలో నుండి త్రుళ్లి పడి వదిన వెంట బయలుదేరి వెళ్లాను. వదిన కాఫీగ్లాసు అందిస్తూ-పిల్లా! రేపు నిన్ను చూడటానికి వస్తున్నారు ... అని మొదలుపెట్టి అన్నయ్య చెప్పిన విషయాలన్ని నా ముందు ఏకరువు పెట్టింది. సాయంకాలమయింది అన్నయ్య సరకులతో రిక్షాదిగాడు. ఆ రాత్రి భోజనాల వద్దకూడా యిదే ప్రసక్తి వచ్చింది.

ఆ రాత్రి ఎలాగడిచిందో కాని మొత్తానికి తెల్లవారింది. ఇంటి పనులన్ని త్వరత్వరగా ముగించి భోజనాలయిన తర్వాత మా వదినచేతి గులాబ్‌జాన్-మైసూర్‌పాక్ వంటకాలవద్ద కూర్చున్నా. యింతలోనే శ్రీ వారు...వారి అన్నగారు వచ్చిరని, ఎక్కడో స్నేహితుల యింటి వద్ద కూర్చున్నారని, మా అన్నగార్కి పిలుపు వచ్చింది. అప్పటిదాకా ఏం

మాట్లాడుకొన్నారో ఏమో కాని మధ్యాహ్నం గం 12 లకు అన్నయ్య హడావిడిగావస్తూ - "లే అమ్మా...యింకా యిక్కడే కూర్చున్నావా ? వారు బయలుదేరి వస్తున్నారు అంటూనే మా వదిన దగ్గరకు వెళ్ళి వంటకాల విషయమేదో మాట్లాడు తున్నారు.

సరేనని స్నానంచేసి ఆరోజే మాఅన్న తీసుకువచ్చిన వాయిల్ చీర కట్టాను. ఈ లోగా మా అక్క వస్తూనే "అలాగే వెళ్తావా ఏంటి? అ స్నో...పౌడరు రాసుకొని యివ్వాళన్నా కాస్త నున్నగా తయారవే" అంటూ దీర్ఘంతీస్తోంది. నా అరికాలిమంట నెత్తి కెక్కింది. స్నో...పౌడరు రాసుకుంటేనే చేసుకొంటారా ఏంటి? అన్నాను. ఏమోలే, అమ్మాయీకాలం పిల్లలకు మేము చెప్పలేం, అంటూ చల్లగా జారుకొంది. నేను చిన్నప్పటినుండి ఆదర్శవాదిగా-నిడారంభరంగా వుండాలని కోరుకొనెదాన్ని.

ఇంతలోకి మాతమ్ముడు...వాళ్లు వస్తున్నా రక్కాయి - అంటూ నా చెవిలో వూదాడు, గసిలోకి ఒక్కగంతు వేసాను. నాలో ఎక్కడలేని సిగ్గు-భయం నన్నప్పుడు ఆవహించాయి. రానే వచ్చారు ఆయిద్దరూ - ఒకాయన శ్రీవారు-యింకొకరు వారి అన్నగారు. వచ్చి కుర్చీల్లో ఆసీనులయ్యారు. అన్నయ్య నా దగ్గరకువచ్చి "ఫలహారాలన్ని తీసుకువెళ్ళమ్మ అన్నారు, వదిన అప్పటికే ప్లేట్లలోనింపుతోంది. ప్లేట్లుతీసుకొంటుంటే, చేతులు వణుకుతున్నయి కాళ్లు కదలడంలేదు. ధైర్యాన్నవలంబించి సర్కసువానిదగ్గరకు వెళ్లే బెబ్బులిలా బయలుదేరి వెళ్లాను. రెండు ప్లేట్లను చెరొకటి యిచ్చి వచ్చాను. అంతవరకు ముఖాముఖీ చూడాలనుకొన్న నాకు మసకతెర అడ్డువచ్చినట్లుంది. అయినా వెనుదిరగబోయే ముందు అలా ఓరకంటితో చూసాను. శ్రీవారూ అప్పుడే నావంక దొంగ చూపులు చూస్తున్నారు. మొత్తానికి ఆరోజు సరిగ్గా చూడలేదు కాని... ఎప్పుడో, ఎక్కడో చూసినట్లుగా వున్నారు. ఆలోచించడం మొదలుపెట్టాను ఒక్కసారిగా నాస్మృతిపథంలో మెలిగారు. అవును ... క్రితంసారి మా కాలేజీ శెలవు లిచ్చినప్పుడు యింటికి వస్తున్నాను - నేనుబస్సు దిగుతుంటే శ్రీవారూ అందులోనే వున్నారనుకొంటా నా బ్యాగ్ సూట్‌కేసు బస్సునుండి దిగి నాకు చేతికియిచ్చినట్లు గుర్తు అయినా ఇప్పుడెందుకులే అవిషయాలు అనుకొని నా రూమ్‌లో మెదలకుండా కూర్చున్నాను. కాఫీలనంతరం బయలుదేరటానికి లేచారు. అన్నయ్య కూడా వారి వెంట బయలుదేరి వెళ్లారు. నేను గదిలోకి వచ్చాను. ప్లేట్లు మాత్రం కదల్లేదు. గ్లాసులు ఖాళీగావున్నాయి.

మావదిన గదిలోకి వస్తూనే ఏమోయి! ఒంటరిగా వున్నప్పుడు మహా కోతలు కోసేదానవు-అసలువార్ని సరిగ్గా చూసావా? అంది - పో వదినా నీకెప్పుడూ పరాచికాలే అన్నాను. వదిన వంటింట్లోకి వెళ్లింది. సాయంకాలం గం 6 లు కావస్తోంది. అమ్మాయి! అంటూ అన్నయ్య పిలుపువినిపించింది. లేచి అన్నయ్య దగ్గరకు వెళ్ళాను. ఏం! అమ్మా! - నీ అభిప్రాయం ఏంటి? నీకు నచ్చాడా? అని విషయాలన్ని వివరించి చెప్పారు, నీవు నా మాటకు ఎదురు చెప్పవనే దృఢ నిశ్చయంతోనే వివాహం కూడా ఖాయంచేసి వచ్చాను, కట్నం ఏదో మా అన్నయ్య యిస్తా నన్నారట-వారేవో లాంఛనాలు పెట్టమన్నారట. ఉభయులు అంగీకరించారట. ఇంకా లగ్నం పదిరోజులుండట-అని వివరించి చెప్పాడు. ఇక్కడ యింకొకవిషయం చెప్పడం మర్చే పోయాను. మా పెండ్లి ఆదర్శంగా జరగాలనుకొన్నారట. ఇది ఉభయులూ తీర్మానించినవేనట. నేను యింటి పనుల్లోను, మా వదిన పెండ్లి పనుల్లోను లీనమయి ఆ పదిరోజులు అట్టే గడిపేశాము.

రానే వచ్చింది పెండ్లిరోజు. నేను నా ముఖ్యస్నేహితులకు పది మందికి మాత్రమే శుభలేఖలు పంపించాను ఆరోజు సాయంత్రానికే స్టేషను దగ్గరకు మా జగదీశ్వర్ని పంపించి వాళ్లను ఆహ్వానించమన్నాను... స్నేహితులు రానే వచ్చారు...వాళ్లను చూసేటప్పటికి నాకు కొంచెం ధైర్యం ఏర్పడింది చీకటి పడేటప్పటికి పెండ్లివారి కార్లు కూడా వచ్చాయి రొదన చేసుకొంటూ-ఒక కారునిండా శ్రీవారి స్నేహితులు వచ్చారని, అందరూ కాలేజికుర్రవాళ్ళులా వున్నారని మా తమ్ముడు వచ్చి నా చెవిలో వేసిపోయాడు. వాళ్ళ పేరు ఎత్తితేనే నాకు గుండెల్లోదడ-ఏంగొడవ చేస్తారో అని. మొత్తానికి అన్నయ్య శాంతంవల్ల అంతా శాంతిగానే జరిగింది.

పెండ్లివారు బంతులు బారులు దీర్చి పడకలకు విడిదింటికి వెళ్ళారు. లగ్నం తెల్లవారు జామున కావడం వల్ల అలా ఒక నిద్రతీద్దామని నడుములు వాల్చాము. నిద్రకు వాలామో లేదో మా వదినవచ్చి టైమయింది లేవండి కాలకృత్యాలవీ తీర్చుకొనేటప్పటికి పుణ్యకాలం కాస్తా వస్తుంది రండి రండి అని తొందరపెట్టింది.

లేచి టాయిలెట్‌కు బయలుదేరాము, నా చుట్టూ మా ఫ్రండ్సు తయ్యారయి నన్ను ముప్ప తిప్పలుపెట్టి మూడు గంటలకు పెండ్లి పీటలపైకి పంపించారు. మా పెండ్లికి తతంగా లేమీ

లేవుగా - ఆదర్శమైన పెండ్లి అని చెప్పాను కదూ! ఎవరో ఆదర్శవాదట వచ్చారు. మొదట పెండ్లిండ్లపై ఉపన్యాస మిచ్చారు. ఉపన్యాసానంతరం మా చేత ప్రమాణాలు చేయించారు. సూత్రధారణ అయింది. పెండ్లి ముగిసింది. కాని శ్రీవారు వంచినతల ఎత్తలేదని, నేనే మెరుగనిపిచ్చానని తర్వాత మా చెల్లాయి చెప్పింది.

స్నేహితుల్ని సాగనంపటానికి కామోసు చకచకా బయటకు వెళ్లారు. మావారి సీరియస్ చూస్తుంటే పురాణాల్లో చెప్పే దూర్వాస మహాముని గుర్తుకొస్తున్నాడు. శ్రీవార్ని తల్చుకుంటుంటే శరీరంలోని అణువణువూ భయంతో కంపించిపోతోంది.

తెల్లవారింది. పెండ్లి వారు కాఫీలు త్రాగి యిక తిరుగుముఖం పట్టారు.



అప్పటికి నేనొక యింటిదాన్నయ్యాను. అన్నయ్య బరువును దించాను. నామనస్సు తేలికపడింది. మేము యింట్లోకి వెళ్ళుతుంటే పేర్లు చెప్పమని గడపవద్ద అడ్డు తగిలారు. శ్రీవారు నిద్రమత్తులో వున్నారో! ఏమో, ఒక్క గదుముగదిమారు, అంతే అందరూ లేడిపిల్లల్లా ఒక్క గంతువేసారు, ఇంట్లో కూర్చో కుండగనే పూలదండలు కుర్చీలో కిరాటు వేసి మమ్మల్ని కూడా మూడు నిద్రలకని అప్పుడే బయలు దేరమన్నారు తర్వాత యితే వర్జ్యంవస్తుందని, మా కని ఒక చిన్న కారు స్పెషల్‌గా అట్టి పెట్టేరు. నాతో మా అక్క, వదిన, మా బావ బయలుదేరారు. మా శ్రీవార్ని - నన్నూ ఒకేచోట కూర్చోమన్నారు. కారు కదిలింది మాటలు సాగాయి. మా వదిన, అక్కా ఏవో మాటలనుకొంటూ నవ్వుకొంటున్నారు. నా కప్పటికీ బాగా గుర్తు మా వారు చిరునవ్వు మోముతో యింతకూ పెండ్లి కుమార్తె పూర్తి పేరేమిటో - యిప్పుడు చదివేది ఏంటి? అంటూ ఒక డైలాగ్ విసిరారు. ఒక్కసారిగా అందరమూ నవ్వాము వారు నవ్వారు పాపం! వారి కెలా తెలుస్తుంది. శుభలేఖలో మాత్రం ఏవో పొడి అక్షరాలు పెట్టారు. అందులో యింగ్లీషులో అచ్చువేయించారు. వారసలు శుభలేఖలే అచ్చు వేయించలేదట, నిజంగా వారికి నా పూర్తి పేరు తెలియదనుకొన్నాను వారి ముఖారవిందాన్ని చూసి. మా వదినే చెప్పిందనుకొంటా తర్వాత నా పూర్తిపేరు. నాచదువు వగైరాలను గురించి-మావారి మాటలు వింటుంటే నాకు చెప్పరాని నవ్వువచ్చింది. చాల గమ్మత్తుమనిషి అనుకునేదాన్ని కాని, నవ్వుతున్నట్లే అవుపించేవారు అంతలోనే సీరియస్‌గా ముఖ కవళికల్ని మార్చేవారు. అప్పట్లో నాకంతా అగమ్యగోచరంగా వుండేది.

మొత్తానికి నవ్వుమొఖంతోనే మా అత్తవారింట కారుదిగాము. మాకు ఒక గది స్పెషల్‌గా యిచ్చారు. శ్రీవారి సరంజామాకూడా మాతోనేవుంది. అక్కా వదినలు స్నానానికని వెళ్లేరు. మావారు గదిలోకివస్తూనే 'ఏయ్! లుంగీ యిటుతే ఆ సంచిలో వుంది' అన్నారు. అప్పుడు కామోసు వారిని తనివితీర చూసాను. వారికి లుంగీయిచ్చి నిల్చున్నాను. మా వారు కుర్చీలో కూర్చుంటూ 'ఏం! సరోజా! అలాగే నిలబడివున్నావే కూర్చో' అన్నారు. నేను భయపడుతూనే చాప మీద కూర్చున్నాను. ఇక మొదలు పెట్టారు ... చదువేలావుంది? మార్కు లేలా వస్తున్నాయి? ఫస్టుమార్కు లెవరికి వస్తాయి? హాస్టలుమీల్సేనా? అంటూ ప్రశ్నలవర్షం నాపై కురిపించారు. నేను మాత్రం అప్పటికి సమాధానం చెప్పక

మౌనంగావున్నాను. 'మాటలు రావా? మూగదానివా?' అన్నారు. ఇక మాట్లాడకపోతే బాగుండదేమో నని వినపడ లేదా ప్రమాణాలు అన్నాను అప్పటికేదో సమాధానం చెప్పి లేచి వెళ్ళిపోయారు. అప్పుడప్పుడూ మా దగ్గరకు వస్తూ—పోతూ యుండేవారు మాకు ఏమేమి కావాలో లోటు రానీకుండా చూస్తునేయుండేవారు

రెండు రోజులు గడచిపోయాయి. మూడవరోజు ఉదయానే టిఫిన్ కాఫీలు తీసుకువచ్చారు. వారికికూడా మావద్దకే తెచ్చారు. పత్రిక చదువుతున్నారను కొంటా దాన్ని అలా గిరాటువేసి టిఫిన్ కాజేసారు. నేను వారివంకే చూస్తున్నాను. కాఫీగ్లాసు నోటి కంటించారో లేదో? గ్లాసు బయటకు విసిరిగొట్టి లేచి వెళ్ళిపోయారు. నాకు వళ్ళంతా చెమటలుపోసింది. అందరూ నిర్విణ్ణులై పోయారు. ఎవరినోటివెంట ఏమాటవస్తే ఎలా పరిణమిస్తొందో అని అందరూ భయపడిపోయారు. చివరకు వారి యింటిలోవారుకూడా యీ విషయాన్ని గురించే గుంపు చింపురుపడుతున్నారు .తర్వాత మా అత్తగారిపై కేకలువేస్తుంటే విన్నానసలు విషయం. 'కాఫీలో పంచదార ఎక్కువయిందట — అందుకట గ్లాసు గిరాటు వేసింది. అప్పటినుండి నాలో గుండెదడ పూర్తిగాప్రవేశించింది. వీరితో ఎలామెలగాలో నాకర్థంగాకుండా వుంది. వీరితో ఎలా మెలగాలి? యిదే నా సమస్య. స్త్రీస్వాతంత్ర్యాన్ని హక్కులనుగురించి స్టేజీ యెక్కి మాట్లాడిన రోజులు గుర్తుకొచ్చాయి. ఆ ఊక దంపుడు ఉపన్యాసాలకు నేడీ ప్రత్యక్ష అనుభవాలకు చాలా తేడా కన్పించింది. ఏది ఎలా ఉన్నప్పటికి శ్రీవారంటె హడలూ, గుండెదడనూ. మరుసటిరోజు మా యింటికెళ్లాము శలవులు బాగానే గడిచాయి. శ్రీవారు వారి స్కూలుకు వెళ్ళారు. నేను మా కాలేజీకి వెళ్లాను కాని నాలో ఒక్క కోర్కెమాత్రం మిగిలింది. శ్రీవారి కోపాన్ని ఒకసారి చవి చూడాలని ఎప్పటి కెలా లభ్యమవుతుందో?

★




# మీరు కోరినవన్నియు సమకూడును



నమ్మకాన్ని విడవకండి! మీకార్యములన్నియు సమకూడును!! ఆశలన్నియు నెరవేరును!!! సూర్యచంద్రగ్రహణములలో పరిశుద్ధము చేయబడినది. ఈ మాంత్రిక ఉంగరమును ధరించినచో మీరు ప్రేమించిన ఏ స్త్రీ యయినను ఎంతదూరంలో ఉన్నదయినను, మీ పాదాక్రాంతమై మీరు చెప్పినటుల చేయుటకు సిద్ధపడుదురు. అన్ని అడ్డంకులను, విరోధములను జయించి మీరు ప్రేమించినవారినే పెండ్లిచేసుకొనవచ్చును. వ్యవహారములు, వర్తకము, చేతిపనులు, పరీక్ష మున్నగువానిలో విజయమును పొందవచ్చును. చెడ్డగ్రహములవలన యేర్పడునట్టి దుష్ఫలితములు మారి అదృష్టదేవతానుగ్రహమునకు పాత్రులు కాగలరు. దీర్ఘాయువు, ఎనలేని అయిశ్వర్యము, శాంతి సమాధానములతో జీవింపగలరు.



| | |
|---|---|
| మాంత్రిక ఉంగరము ఖరీదు | **1—15—0** |
| స్పెషల్ ఉంగరము | **3— 0—0** |
| స్పెషల్‌శక్తిని పొందినది | **3—15—0** |

విద్యుద్వేగములో ఫలితమిచ్చునది. ఫలితములేనిచో ఉంగరము ఖరీదు వాపస్ (తపాలఖర్చు వేరు)

**RAJ JYOTISHI Pt. DEV DUTT SHASTRI TANTRIK, (C.G.M.) JULLUNDUR CITY, E. PUNJAB.**